# శిష్యులుగా నుండ పిలుపు

## లూకా 5:1-11, పరిశీలన

బైబిల్లో యేసును అనుసరించేవాడికి సర్వసాధారణంగా “శిష్యుడు” అని అంటారు (మత్తయి 5:1; 8:21, 23; 9:19; అపొ. 6:1, 2, 7; 9:1). “నేర్చుకొనువాడు” అని అర్థమిచ్చే గ్రీకు పదం నుండి “శిష్యుడు” అనే మాటను అనువాదించారు.[1] శిష్యుడంటే ఉపాధ్యాయుని వెంబడించువాడు (మత్తయి 16:24), ఉపాధ్యాయుని వద్దనుండి నేర్చుకొనువాడు (మత్తయి 11:29), ఉపాధ్యాయుని ఆదేశాలను అనుసరించువాడు (యోహాను 8:31). బోధకుడు, శిష్యుడు ఇరువురికి సన్నిత సంబంధం ఉండేది. నిజమైన శిష్యుడు తన బోధకునివలె రూపొందుతాడు (మత్తయి 10:25ఎ).

“శిష్యులుగా నుండ పిలుపు” అనే ఈ ప్రసంగం కొరకు మన లేఖన భాగం లూకాలో 5:1-11,[2] ప్రభువైన యేసు పేతురునూ, అతని స్నేహితులనూ పిలిచిన సందర్భం ఉంది. మనం దీన్ని చదివేటప్పుడు, శిష్యునికి ఉండవలసిన కొన్ని లక్షణాలను కొన్నింటిని కనుగొంటాం.

### నీవు ఏదో కొంత నేర్చుకోవాలి (1-3 వచనాలు)

నీవు యేసుకు శిష్యుడుగా ఉండగోరినట్లయితే, నీవు ఏదో ఒకటి నేర్చుకోవాలి. నీవు ప్రభువుచే బోధింపబడుటకు ఇష్టపడాలి. “నాకు ఎవడును ఏదియు బోధించలేడు.” కొందరు అన్నీ తమకే తెలుసుననుకుంటూ ఉంటారు. నీవు ఆలకించి నేర్చుకొనడానికి సిద్ధపడేవరకు నీవు క్రీస్తు శిష్యుడుగా ఉండనేరవు. దీని ప్రాముఖ్యత మన లేఖన భాగంలో కన్పిస్తుంది.

యేసు గలిలయ సముద్రతీరాన[3] చేస్తున్న బోధతో ఈ కథ ఆరంభం అవుతుంది. సమీపముననే సీమోను పేతురు తన వలను బాగుచేసికొంటూ తన దోనె ప్రక్కనే నిలిచి యున్నాడు. అతడును అతని స్నేహితులును రాత్రంతా శ్రమపడినా వారికి మిగిలిందంతా నొప్పులు పుట్టే కండరాలు, మురికైన వలలు మాత్రమే. పేతురు ముడిపడ్డ తాళ్ళ మధ్యలో ఉన్న మురికిని, మట్టిని వేళ్ళతో తీసివేస్తూ మెడతిప్పి ప్రభువు సందేశం వింటున్నాడు. అతడు ప్రభువుకు ఎదురుపడడం యిదే తొలిసారి కాదు. యూదయలో అతడు ప్రభువుతో పయనించాడు. కాని, ప్రభువు గలిలయ ప్రాంతానికి వచ్చినప్పుడు, అతడు తిరిగి తన మొదటి వృత్తికి మళ్ళాడు.

ప్రభువు బోధిస్తుండగా, జన సమూహం పెరుగుతూ వచ్చింది. ఆసక్తి కలిగిన శ్రోతలగుంపు ప్రభువు కాలి జోళ్ళలోకి నీరు చొచ్చుకునేటట్లుగా ఆయన్ను చెరువు దగ్గరకు తెచ్చారు. ఆయన పేతురు యొక్క నావ దాకా వెళ్ళి, అందులో కాలుపెట్టి, అతని నావను కొంచెం లోతునకు నడిపించుమని కోరాడు. అప్పటికప్పుడు ఆ నావను ప్రసంగ వేదికగా

మార్చుకొని, దానిలోనుండి ప్రభువు తన ఉపన్యాసాన్ని లేక గోష్ఠిని కొనసాగించాడు.

ఆ నావ మధ్యకూర్చుండి, దానిని కదలకుండ నిలుప ప్రయత్నించిన పేతురు ఏమి చేస్తూ ఉంటాడని నీ తలంపు? యేసు "దేవుని వాక్యమును" బోధిస్తూ ఉన్నట్టు మన లేఖన భాగం తెలుపుతుంది (1 వ.). దేవుని వాక్యం వినే విద్యార్థివై ఉండకుండ నీవు ప్రభువు శిష్యుడవై ఉండలేవు. "నేను సాత్వికుడను దీన మనస్సుగలవాడను గనుక మీ మీద నా కాడి ఎత్తికొని నా యొద్ద నేర్చుకొనుడి; అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరకును" అని ప్రభువు అన్నాడు (మత్తయి 11:29). ఆయన శిష్యులమని చెప్పుకొంటున్న - వారిలో కొందరు సంవత్సరాలెన్ని గడిచినా బైబిలును మాత్రం తెలుసుకోలేరు. బైబిలులో రాసిన సత్యాలను గంభీరంగా తెలుసుకునే విద్యార్థి కాకుండ నీవు ఆయన శిష్యరికం పొందలేవు.

## ఏదో కొంత నీవు గ్రహించాలి

## (3-8 వచనాలు)

చివరికి, ప్రభువు తన ప్రసంగాన్ని ముగించాడు. జన సమూహం దగ్గర తన పని అయిపోయింది, కాని పేతురుతో మాత్రం కాదు. పేతురు దగ్గర గాఢమైన సామర్థ్యం ఉంది. అంతేగాక, అతడు నేర్చుకోవలసిన అనేక సంగతులున్నాయి. తన రెండవ పాఠానికి సమయం ఆసన్నమయ్యింది. ప్రభువైన యేసు, ఎల్లవేళ్లలో సామాన్యమైన ఉపదేశకుడుగా, ఎదురుచూడని దానిని జరిగించాడు, "చేపలు పట్టుటకు మీ వలలు వేయుడి" అని ఆయన సీమోను పేతురుకు ఆజ్ఞాపించాడు (4 వ.).

గలిలయ సముద్రం దగ్గరున్న, ప్రతి జాలరికి తెలిసిన సంగతి సీమోనుకు తెలుసు. చేపలు తిండికి వచ్చే సమయం రాత్రులే - పగటిపూట కాదు. చేపలు పట్టే లోతు నీటిలో కాదు, లోతులేని చోట్లలోనే. చేపలు పడే సమయంలో ప్రయాసపడాలి - ఫలితం లేకుండ దాదాపు పది గంటలు ఆ ప్రాంతంలో ప్రయత్నించిన మీదట, రాత్రియంతా మేల్కొని ఉండి అలసిపోయాడు.

అనుభవజ్ఞుడైన, కష్టించి పనిచేసేవాడైన సీమోను చేపలునెలా పట్టాలో ఒక వడ్రంగి చెప్పితే కోపం రావడం సహజం (మార్కు 6:3). (ఎప్పుడూ ప్రసంగించి ఎరగనివాడు ఎలా ప్రసంగించాలో నాకు చెప్పితే నాకు కోపం వస్తుందని ఒప్పుకుంటాను) "ఏలినవాడా, రాత్రి అంతయు ప్రయాసపడితిమి గాని మాకేమియు దొరుకలేదు ..." అనే పేతురు ప్రత్యుత్తరం దీన్ని సూచింపవచ్చు (5ఎ వ.).

"అయినను" అంటూ దాని వెంట పలికిన మాటలు గమనించు, "... అయినను నీ మాట చొప్పున వలలు వేతుమని ఆయనతో చెప్పెను." మరోవిధంగా చెప్పాలంటే, "ఏమీ సాధించకుండానే మేము రాత్రి అంతా చేపలుపట్ట ప్రయత్నించాం. మరలా ప్రయత్నించమని నీవంటే, నేను చేస్తాను. చేపలు పట్టడంలో దశాబ్దానికి పైగా నేను నేర్చుకున్న ప్రతిదానికి యిది వ్యతిరేకంగానే ఉండవచ్చును కాని, నీవు చెప్పే దానిని నేను చేస్తాను" అని పేతురు అంటున్నాడు.

ఆలాటి స్వభావం పేతురుకు ఎలా వచ్చింది? యేసును అతడు సంబోంధించిన బిరుదులో దీనికి సమధానం గోచరిస్తుంది: "ఏలినవాడా." ఇది మూల వాక్య భాగంలో "బోధకుడా" లేక "ప్రభువా"[4] అనే పదానికి సాధారణమైన పదం కాదు. ఈ ప్రత్యేకమైన పదం లూకా మాత్రమే వాడాడు, అది ప్రత్యేకంగా క్రీస్తుకే ఉపయోగించాడు (లూకా 8:24, 25; 9:33; 49; 17:13). ఇది గ్రీకులో సంయుక్త పదమై ఉంది. ("Stand" మరియు "over" - one who stands over) "ఒకరికి పైగా నిలిచి యుండువాడు," – మరియొకని మీద సంపూర్ణమైన అధికారము కలిగియున్నవాడు. ప్రభువు ఆజ్ఞకు పేతురు అంగీకారం చూపాడా, లేదా అనేది ముఖ్యమైనది కాదు. యేసు – ఏలినవాడు, అతడు ఆయనకు బానిస; లోబడడానికి సిద్ధమైయున్నాడు.

మనం యేసుకు శిష్యులుగ ఉండగోరితే, మనం ఏదో ఒకదాన్ని గ్రహించినవారమై ఉండాలి. మనం యజమానికి ఆదేశాలు యివ్వలేం; ఆయన మనకు ఆదేశాలు యిస్తాడు. మనం ఏమి చేస్తాము, ఏమిచేయము అనేదాన్ని మనం ఆయనకు చెప్పలేం. మనం ఏమి చేయాలో ఆయనే ఆదేశిస్తాడు. "యజమానుడు" అనేది బలమైన పదం. యజమానుడు సలహాలు యివ్వడు, ఏలినవాడు ఆలోచనలు చెప్పడు; యజమానుడు ఆజ్ఞలు జారీ చేస్తాడు – ప్రశ్నించకుండ లోబడవలసిన ఆజ్ఞలనిస్తాడు.

తన నావను లోతునకు నడిపించడం పేతురుకు అవివేకంగా తోచి ఉండవచ్చు. తాను వలలు విసిరేటప్పుడు యిబ్బందిగా తోచి ఉండవచ్చు. తీరాన ఉన్న జాలరుల అవహేళనకు అతడు గురియై ఉండవచ్చు.[5] అయినా యజమాని ఆజ్ఞాపించిన దానిని అతడు చేసాడు.

అతని విధేయతకు ప్రభువు ఎలా బహుమానమిచ్చాడు? త్వరలోనే తన చేతిలోని తాళ్లబిగువుకు పేతురు స్పందించాడు. అతడును అతని సహాయకులును – చేపలతో నిండిన వలలను దరికిలాసాగారు. చేపలు వలలో గుమి కూడాయి. ఆ వలను దోనెలోనికి లాగడానికి జాలరులు తిప్పలుపడ్డారు. వాటితో దోనె మునిగిపోయేలా ఉంది. ఉద్రిక్తత ఎక్కువకాగా, వారు తమ తోటివారిని సహాయం చేయమని సంజ్ఞలు చేసారు.

యాకోబు యోహానులు తమ దోనెలో వారికి చేరువగా వచ్చారు. ఎగురుతూ జారిపోయేలా ఉన్న చేపలతో రెండు దోనెలు నిండాయి.[6] అవి మనకు ఎరుకలో ఉన్న 10 లేక 15 అడుగుల పొడవుగల పడవలు కావు. గలిలయ సముద్రములో వృత్తిపరంగా వినియోగించే 20 లేక 30 అడుగుల దోనెలవి. అనుభవంగల ఆ జాలరులు ఆలాగు పడిన చేపలను ఇంతకు ముందెన్నడూ చూడలేదు.

పేతురుకును మిగిలిన జాలరులకును అది కనుతెరుపుగా ఉంది! చేపలు పట్టే విషయంలో కూడా, ప్రభువుకు తానేమి మాట్లాడుతున్నాడో తెలుసు!

ఎక్కువ సమయాల్లో, ప్రభువు యొక్క ఆజ్ఞలు అర్ధసహితంగా ఉంటాయి. అయితే ప్రతి సందర్భంలో అలా మనకు అర్ధమౌతాయనే గ్యారంటీ ఏమి లేదు.[7] ఇది నాకు "న్యాయంగా ఉన్నట్టు కన్పిస్తుందా?" అనేది ప్రశ్న కాదు. కాని ప్రశ్న ఏమంటే – "చేయుమని క్రీస్తు నాకు ఆదేశించింది యిదేనా?" అలాగైనట్టయితే, పేతురులా ప్రత్యుత్తరమిద్దాం:

"అయినను నీ మాట చొప్పున చేయుదుము." మనం లోబడినట్టయితే, చివరికి ప్రభువు మార్గము సరియైనదని మనం కనుగొనగలుగుతాం!

నీవు యేసు యొక్క శిష్యుడవైయుంటే, ఆయన సమస్తానికి ఏలినవాడైయున్నట్టు నీవు నమ్మవలసి ఉంది. – నీవు ఆ విశ్వాసంతో పని చేయవలసియుంటుంది.

## నీవు ఏదో ఒకదానిని అంగీకరించాలి

## (8-10ఎ వచనాలు)

పేతురు ప్రభువు చేసిన కొన్ని మహాద్భుతాలను చూసాడు. నీళ్లను ఆయన ద్రాక్షారసంగా మార్చడాన్ని అతడు తిలకించాడు (యోహాను 2:1-11). ప్రధాని కుమారుని బాగుచేయడం అతడు గుర్తించాడు (యోహాను 4:46-54). అనేకమైన యితర సూచకక్రియలను అద్భుతాలను క్రీస్తుచేయగా అతడు చూచాడు (యోహాను 2:23; 3:2). అయితే దీనిలా అతన్ని ప్రభావితం చేసింది వాటిలో ఒక్కటి కూడా లేదు. ఇది సీమోను చేస్తున్న వృత్తికి సంబంధించింది. అది అతని జీవన విధానానికి సంబంధించినదే. అది క్రీస్తును అన్నిటికి ప్రభువుగా నిలబెట్టింది.

పేతురు యేసును నూతన దృష్టితో కనుగొన్నాడు. తనను తాను కూడా ఆ క్రొత్త వెలుగులోనే చూసుకున్నాడు. వెంటనే తనలోని లోపములను కనుగొని ఆందోళన చెందాడు. పేతురు ప్రభువు ఎదుట మోకాళ్ళమీద సాగిలబడ్డాడు. "ప్రభువా, నన్ను విడిచిపోమ్ము నేను పాపాత్ముడనని"అన్నాడు (8 వ.) దేవుని మహిమకూ శక్తికీ ప్రభావితులైన జనులు ఎలా స్పందించారో, అతడు కూడా అలాగే స్పందించాడు (ఆది. 18:27; యోబు 42:4; యెషయా 6:5).

నీవు యేసు శిష్యుడవైతే, రెండు సత్యాలను అంగీకరించాలి: మొదటిది, ఆయన సర్వస్వమని నీవు అంగీకరించాలి. తన పాపపు స్థితిని ఒప్పుకుంటూ, పేతురు యేసును ఎలా సంబోధించాడో చూడు. "ప్రభువా" అని అతడు ఆయనను పిలిచాడు. నీవు రక్షింపబడాలంటే, "యేసు ప్రభువని నీ నోటితో ఒప్పు" కోవాలని పౌలు తెలియజేశాడు (రోమా 10:9). రెండవది, ఆయన సర్వస్వమని నీవు ఆయనను గుర్తించగా, నీవెందుకు పనికిరాని వాడవని నీవు గుర్తించాలి. ఆయన అవసరం నీకు ఎంతైనా ఉన్నట్టు నీవు అంగీకరించాలి.

ఎవడైతే "స్వయంసంపూర్ణుడో"[8] వానియందు ఆయనకు స్థలం ఏ మాత్రమును ఉండదు. "ప్రభువు నేనెంతటి మంచివాడనో చూడు! నేనెంత తెలివిగలవాడనో, ఎంత టేలెంట్ గలవాడనో, నేనెంత విజేతనో చూడు! నేను ఏమి సాధించగలనో దానిని నీవు అభినందించగలవని తలంచుతున్నా!" ఆయన పాదముల ఎదుట సాగిలపడి, తన బలహీనతలను గుర్తించి, ఆయన మీద ఆనుకునే అవసరతను ఎరిగినవారిని మాత్రమే క్రీస్తు ఉపయోగించుకొనగలడు. ఇంకొకని మాటలను మనం అప్పుతెచ్చుకుంటే, "దేవా, పాపినైన నన్ను కరుణించుము" అని నీవు చెప్పడానికి సిద్ధపడిన వాడవైయుండాలి (లూకా 18:13బి; KJV).

## నీవు ఏదో ఒకదానిని మార్చుకోవాలి

## (10బి వ.)

తనకును ప్రభువుకును మధ్య ఆగాధముండి వారిరువురిని వేరు చేస్తున్నట్టు పేతురు గ్రహించినప్పుడు – "నన్ను విడిచి పొమ్ము" అని అతడు ఆయనతో అంటాడు (8 వ.). అదృష్టవశాత్తు, ప్రభువు అతని మనవి "వినక పోయెను." పైగా, మరి ప్రత్యేకమైన సవాలుతో ప్రభువు పేతురుకు మరి దగ్గరకు చేరుకున్నాడు: "–భయపడకుము, ఇప్పటినుండి నీవు మనుష్యులను పట్టువాడవైయుందువని సీమోనుతో చెప్పెను" (10బి వ.). "పట్టుదువు" అనేది వర్తమాన కాలంలో ఉండి, కొనసాగించే కార్యాన్ని సూచిస్తుంది. అది ఏదో ఒక్కసారి చేసే అద్భుతం కాదు. అది జీవితాంతం కొనసాగే వృత్తిగా ఉంటుంది. పైగా, "పట్టుదువు" అని తర్జుమా చేయబడిన గ్రీకు పదానికి, "సజీవముగా పట్టుకొనుట" అనేది అసలైన అర్థం.[9] లోకమునకు జీవము నిచ్చు యేసు వద్దకు (యోహాను 6:33) వారు జనులను తోడుకొని వస్తారు. ఈ పిలుపును మత్తయి యిలా దాఖలు చేస్తున్నాడు: "నా వెంబడి రండి, నేను మిమ్మును మనుష్యులను పట్టు జాలరులనుగా చేతును" (మత్తయి 4:19; మార్కు 1:17 చూడు).

తన జీవితాన్ని స్పష్టంగా చూచుకునేందుకు పేతురుకు అవకాశం అనుగ్రహింప బడింది. అతడు చేపలు పట్టడానికి గతంలో దృష్టి నిలిపాడు. ఇప్పుడైతే అతని జీవితం మనుష్యులను పట్టడానికి కేంద్రీకరించబోతుంది.

రాజ్యపు విత్తనాలను చల్లడానికి ప్రభువు వ్యవసాయదారులకు పిలుపునిచ్చాడు (లూకా 8:11).[10] "అమూల్యమైన ముత్యాన్ని" అమ్మడానికి (మత్తయి 13:46; సువార్త వర్తకులకు) ప్రభువు పిలుపునిచ్చాడు. తన యింటికి (సంఘానికి; మత్తయి 16:18; 1 తిమోతి 3:15లను చూడు) చేర్చడానికి ఆయన వడ్రంగులకు పిలుపునిచ్చాడు. ఆత్మలను బాగు చేయడంలో (యోహాను 12:40) గొప్ప వైద్యునితో వైద్యులు పనిచేయడానికి యేసు పిలుపునిచ్చాడు. జీవితంలో నీ వృత్తి ఏదైనా, నీ ఆసక్తి దేనిపైన ఉన్నా, నీవు యేసు శిష్యుడవైయున్నట్టయితే, నీ జీవితాన్ని పునః పరిశీలన చేసికొనవలసియుంటుంది. నీ జీవిత ధ్యేయాన్ని నీవు మార్చుకున్నప్పుడు, ప్రాధాన్యతలలోను ప్రత్యేకతలలోను మార్పు ఉంటుంది.

Floyd Schubert, అనే నా స్నేహితునికి, సఫలమైన స్కూల్ సప్లయ్ కంపెనీ ఉంది. తన బల్లమీద, ఈ గురుతు ఉంటుంది: "నా వ్యాపారము దేవుని సేవించడం. నగదు చెల్లించడానికి నేను పెన్సిళ్లు అమ్ముతాను".

## నీవు ఏదో యొకదానిని వదలుకోవాలి

## (11 వ.)

ముందుగా గుర్తించినట్టే, పేతురు ప్రభువుతో ప్రయాణం చేసాడు. అతని స్నేహితులు కూడా. ఇప్పుడు, యేసు వారిని నూతన స్థాయిలో తనకు శిష్యులుగా ఉంచుకోగోరి, పూర్తి సమయం తన్ను వెంబడించుడని ఆయన వారికి పిలుపు నిచ్చాడు.[11] దాన్ని

జరిగించాలంటే, వారు తమ పడవలను, చేపలను సహా వదలుకో వలసి వస్తుంది. వారికి ముఖ్యమైన దానిలో ఎక్కువను వారు వదలుకోవలసి వస్తుంది. స్థిరమైన ఆదాయము, ఆర్థిక భద్రతను వారు వదలుకోవలసి వస్తుంది.

పై సూచనలన్నిటిని బట్టి, గౌరవ పదమైన ప్రమాణాలలో వారికి చేపలు పట్టే వ్యాపారం ఉన్నట్టు గోచరిస్తుంది. వారి పాలివారికి ఒకటి కంటె ఎక్కువైన చేపల నావ ఉన్నట్టు మనం ముందుగానే చూచాం. యాకోబు యోహానులు కూలివారిని పెట్టుకున్నారు (మార్కు 1:20). తరువాత కాలంలో ప్రభువు శిష్యులను ఆర్థికంగా పరామర్శించిన వారిలో యాకోబు యోహానుల తల్లి ఉంది. (మత్తయి 27:55, 56; లూకా 8:3). యోహాను ప్రధాన యాజకునికి నెళవైన వాడు (యోహాను 18:15). మతాధికారులతో అతని కుటుంబానికి వ్యాపార లావా దేవీలు ఉండి వుండవచ్చు. వారికి బహు లాభదాయకమైన వ్యాపారాన్ని వారు వదలుకోవలసి వస్తుంది.

అందులో ఎక్కువగా వదులుకోవలసి వచ్చినా, అది వారికి అలా తోచినట్టు కన్పించదు. 11వ వచనంలో మనం యిలా చదువుతాం: “వారు దోనెలను దరికిచేర్చి, సమస్తమును విడిచిపెట్టి ఆయనను వెంబడించిరి.” పేతురును, అంద్రెయయును పిలువబడినప్పుడు, “వెంటనే వారు తమ వలలు విడిచి ఆయనను వెంబడించిరి” అని మార్కు అన్నాడు (1:18), యాకోబు, యోహానులు – “తమ తండ్రియైన జెబెదయిని దోనెలో జీతగాండ్ర యొద్ద విడిచిపెట్టి ఆయనను వెంబడించిరి” (20 వ.).

“కాని ప్రతి శిష్యుని యొద్దనుండి ప్రభువు తప్పక ఆలాటి దానినే కోరడం లేదని” ఆక్షేపణ తెలియజేయవచ్చు. లూకా 14లో, తన్ను వెంబడింపనైయున్న వారితో ప్రభువైన యేసు యిలా చెప్పాడు: “ఆ ప్రకారమే మీలో తనకు కలిగినదంతయు విడిచిపెట్టనివాడు నా శిష్యుడు కానేరడు” (33 వ.). అనేక ప్రసంగ పాఠశాలలో పనిచేసిన వాడవడం వల్ల, లాభసాటి వ్యాపారాలను, ఎక్కువ జీతంవచ్చే ఉద్యోగాలను వదలుకున్న వారిని – దేవుని వాక్యాన్ని బోధించ, ఉపదేశించ నేర్చుకొనడానికి తమకు కలిగిన దానినంతటిని అమ్ముకున్న వారిని నేనెరుగుదును.

“పూర్తి సమయం సువార్తికులుగా ఉండ సంకల్పం లేనివారి సంగతి ఏమి?” అని కూడా ఆక్షేపకులు అడుగవచ్చు. అయినప్పటికి నీవు ఏదో ఒకటి విడిచిపెట్టవలసి ఉంటుంది. నీకును – హృదయ పూర్వకంగా ప్రభువును సేవించడానికిని మధ్య నిలిచి ఉన్న దేనినైనా నీవు వదలుకోవలసియుంది.[12] మత్తయి 16:24లో క్రీస్తు యిలా నొక్కి పలికాడు: “–ఎవడైనను నన్ను వెంబడింపగోరినయెడల, తన్నుతాను ఉపేక్షించుకుని, తన సిలువ నెత్తికొని నన్ను వెంబడింపవలెను”

ఏదియేమైనా సరే, ప్రభువు నిన్ను కాపాడతాడని విశ్వసించడానికి నీవు అంగీకరించాలి. చేపలు పట్టే విషయంలో ప్రభువు వారి అవసరతను ఎలా తీర్చాడో అలాగే తమ ప్రతి అవసరతను ఆయనే తీర్చునని గలిలయ సముద్రాన్ని విడిచిపోయేటప్పుడు, పేతురు, అంద్రెయ, యాకోబు, యోహానులు నమ్మి ఆయనను వెంబడించారు. కొన్ని సార్లయితే, ప్రభువును మనం ఎలా నమ్మాలో అలా నమ్మం. “నేను క్రైస్తవుడను కాకముందు ఏ విధంగా చేసానో ఆ వ్యాపారాన్ని వదలుకొంటే, నాకు

జీవనమే ఉండదు. నా కుటుంబం ఆకలితో అలమటిస్తుంది" అని చెప్పిన ప్రజలను నేనెరుగుదును! ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకినట్టయితే జీవనావసరాలు తీరుతాయని ప్రభువు వాగ్దానం చేశాడు (మత్తయి 6:33). పౌలు ఫిలిప్పీయులకు యిలా వ్రాశాడు: "కాగా దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తు యేసునందు మహిమలో మీ ప్రతి అవసరతను తీర్చును" (ఫిలిప్పీ. 4:19).[13]

ఒక సారి పేతురు ప్రభువుతో యిలా అన్నాడు: "ఇదిగో – మేము సమస్తమును విడిచిపెట్టి నిన్ను వెంబడించితిమి" (మార్కు 10:28). అందుకు ఆయన వారికి ఈ ఆభయమిచ్చాడు:

> నా నిమిత్తమును సువార్త నిమిత్తమును ఇంటినైనను అన్నదమ్ములనైనను అక్కచెల్లెంద్రనైనను తల్లిదండ్రులనైనను పిల్లలనైనను భూములైనను విడిచినవాడు ఇప్పుడు ఇహమందు హింసలతోపాటు నూరంతలుగా ఇండ్లను అన్నదమ్ములను అక్కచెల్లెంద్రను తల్లులను పిల్లలను భూములను, రాబోవు లోకమందు నిత్యజీవమును పొందునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను (29, 39 వచనాలు).

క్రీస్తు శిష్యుడుగా ఉండగోరి నీవు దేనిని విడిచిపెట్టినా సరే, ప్రభువు నీకు యిచ్చే దానికంటే అధికం కాదు.

## నీవు ఏదో ఒకటి చేయాలి (11 వ.)

క్రీస్తు శిష్యుడుగా ఉండడానికి సంబంధించి ఒక్క చివరి అవసరతను ప్రస్తావించవలసి యుంటుంది. విదితమైన అవసరత "శిష్యుడు" అనే పదంలోనే యిమిడియుంది. దానిని మనం యింతకు ముందే చూచాం. అయితే దానిని మరలా ప్రస్తావించాలి: నీవు ఏదో ఒకటి చేయవలసి ఉంది. ప్రత్యేకించి నీవు ఆయనను వెంబడించాలి. పేతురును, తక్కినవారును "సమస్తమును విడిచిపెట్టి ఆయనను వెంబడించిరి" అని మన లేఖన భాగం చెప్పుతుంది. (11 వ.) "వెంటనే వారు తమ వలలు విడిచి ఆయనను వెంబడించి"రని మత్తయి, మార్కులు నొక్కి చెప్పుతున్నారు (మత్తయి 4:20, 22; మార్కు 1:18, 20) "ఎవడైనను నన్ను వెంబడింపగోరిన యెడల, ... తన సిలువనెత్తికొని నన్ను వెంబడింపవలెను" అని ప్రభువు అన్నాడు (మత్తయి 16:24).

పేతురుకుగాని, తక్కినవారికిగాని క్రీస్తును వెంబడించడం అంత తేలికైన పని కాదు. యేసును వెంబడించడంలో, శిష్యులు శత్రుత్వాన్ని, అలసట చెందడాన్ని, కడకు మరణాన్ని సహా అనుభవించవలసి వచ్చింది. అయినప్పటికిని, వారు సమర్పణగలవారై యున్నారు. తాను ఎక్కడికి వెళ్లగోరినా, వారు ఆయనను వెంబడించారు.[14]

మీలో కొందరు యింకను ఆయన శిష్యులుగా ఉండక పోవచ్చు. నీ కొరకు మరణించినవానిగాను, నిన్ను రక్షించువానిగాను నీవు క్రీస్తు యేసునందు విశ్వాసముంచు వాడవైయుండాలి: "నేనే ఆయనను (మెస్సీయను) అని మీరు విశ్వసించనియెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురు" (యోహాను 8:24). రక్షింపబడడానికి ఏలినవాని ఆజ్ఞ ఏమంటే – "నమ్మి బాప్తిస్మము పొందడం" (నీట ముంచబడడం) (మత్తయి 28:18; మార్కు 16:16). నీవు క్రైస్తవుడుగా అయ్యుంటే, నీ యావజ్జీవితం నీవు ఆయనను

వెంబడింపవలసియుంటుంది. తన అడుగుజాడల యందు నడుచుకొనునట్లు ఆయన మనకు ముందుగా మార్గం ఉంచిపోయాడు (1 పేతురు 2:21). అది ఎల్లవేళ్లలా సులభంగా ఉండేది కాదు (అపో. 14:22). అయితే ఆయన శిష్యుడుగా ఉండగోరడంలో యిది “అత్యల్పమైన అవసరతయైయుంది!”

## ముగింపు

శిష్యుడుగా ఉండగోరడంలో మనం పలు ఆవశ్యకతలను చూచాం.

మనం ఏదో కొంత నేర్చుకోవాలి: అంటే, మనం వాక్యపు విద్యార్థులమైయుండాలి.

మనం ఏదో కొంత గ్రహించాలి: అంటే, ప్రభువైన యేసు మన జీవితాలకు ఏలినవాడై యుండాలి.

మనం ఏదో ఒకదానిని అంగీకరించాలి: మన చాలనితనాన్ని అంగీకరించి, క్రీస్తుపై ఆనుకొనడం యొక్క అవసరతను గుర్తించాలి.

మనం ఏదో ఒకదానిని మార్చుకోవాలి: మన జీవితపు ధేయ్యాన్ని మార్చుకోవాలి. ప్రభువును మహిమపరుస్తూ, యితరులను ఆయనవద్దకు నడిపిస్తూ ఉండాలి.

మనం ఏదో ఒకదానిని వదలుకోవాలి: ప్రభువును హృదయపూర్వకంగా సేవించ కుండ ఆటంకపరచే దేనినైనా మనం వదలుకోవాలి. ఆయనయందు నమ్మికయుంచ సిద్ధపడాలి.

మనం ఏదో ఒకటి చేయాలి: ఎక్కడ వెళ్లాలని ఆయన మనలను కోరుతున్నాడో, అక్కడికి చేరడానికి ఆయనను వెంబడించ సిద్ధపడాలి.

ఆయన శిష్యుడై ఉండగోరడానికి కావలసిన దంతా నీవు కలిగియున్నావా?[15]

---

సూచనలు

[1]“నేర్చుకొను” “ఒకడు” అనే రెండు గ్రీకు పదాల సమ్మేళనమైయుంది. [2]పైన పేర్కొనబడిన లేఖన భాగాలతో పాటు యోహాను 13:35, యోహాను 15:8 వంటి లేఖన భాగాలను చేర్చవచ్చు. దృష్టి మాత్రం లూకా 5:1–11 మీద నిలుపుతాం. [3]లూకాలో “గెన్నేసరెతు సరస్సు” అని ఉంది. గలిలయ సముద్రానికి అది మరియొక పేరు. దీన్ని పటంలో చూడు. [4]అదే పదం యేసును సంబోధించడానికి 8వ వచనంలో ఉపయోగింపబడింది. [5]వందలమంది జాలరులు అందులో చేపలు పడతారు. [6]పడవ మునుగ నారంభించిందని 7వ వచనం అంటుంది. వారు మునిగిపోవడం లేదు. [7]ఎరికో గోడలచుట్టు తిరగడం, యొర్దాను నదిలో ఏడు సార్లు మునగడం వంటి యితర దేవుని ఆజ్ఞలను ఉదాహరణగా చూపవచ్చు. కొందరికి ముంచడంగా బాప్తిస్మం, ప్రతి ఆదివారాన ప్రభురాత్రి భోజనం వంటివి అవసరంలేనట్టు కన్పించవచ్చు. [8]“తనతో తాను నింపబడడం” అంటే, గర్వంతో నిండియుండమని అర్థం. దీనికి నీకు అనుకూలమైన ఉదాహరణను ఉపయోగించుకోవచ్చు. [9]“నీవు మనుష్యులను సజీవంగా పట్టుకుంటావు” అనేది అక్షరార్థమైన తర్జుమా. [10]మా ప్రాంతంలోని వృత్తులను నేను చూపాను. మీ ప్రాంతానికి అనుకూలమైన దాన్ని నీవు వాడవచ్చు.

[11]శిష్యులై యుండగోరడంలోని మూడు అంచెల చర్చను చూడు. [12]మత్తయి 18:8, 9; మత్తయి 5:29, 30ల్లోని బలీయమైన ఉపదేశాన్ని యిక్కడ చేర్చవచ్చు. దేవునికి లోబడనొల్లని దేనినైనా నీవు అణుచుకోవాలి అనేది సందేశం. [13]క్రైస్తవులైనందుకు అనేకులు బాధింపబడినట్టు నేను బాధింపబడలేదు. అలా బాధింపబడిన వారి గొప్ప ఆదర్శం కొరకు నా హృదయం సానుభూతి చూపుతుంది. [14]అపొస్తలుల బలహీనతను నేను ఎరుగుదును యేసుని వెంబడించడంలో కావలసినంత గ్రహింపులు పెదగాలి. ఈ వాక్యములో చెప్పినదే అంతిమ ఫలితం. [15]దీన్ని నీ అవసరతను బట్టి వర్తింపజేసికొనడానికి ప్రయత్నించు.